సాక్షి
విజయనగరం
మంగళవారం ı 12 ı సెప్టెంబర్ ı 2023



వ్యవధిలోగా వినతుల పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

8లో



పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

పరిపాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

8లో



స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

కాలువలో స్నానం చేసి కొద్దిసేపటిలో వచ్చేస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి విగతజీవిగా మారాడు.

8లో

న్యూస్‌రీల్

విభిన్న ప్రతిభావంతురాలికి నియామక పత్రం



నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా బొబ్బిలికి చెందిన బొత్స వీరమాత అనే విభిన్న ప్రతిభావంతురాలికి బీసీ సంక్షేమశాఖలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో నియమిస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నియామక పత్రాన్ని అందజేశారు. 2017–18 లో వెలువడిన నోటిఫికేషన్ అనుసరించి ఆమెను జేసీ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎంపిక చేసింది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ జి.వి.బి.జగదీష్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పత్రాలు అందజేత



ఉద్యోగోన్నతి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: పంచాయతీ కార్యదర్శుల నుంచి పంచాయతీ విస్తరణాధికారులుగా (ఈఓపీఆర్‌ఆర్డీ) ఉద్యోగోన్నతి పొందిన ఐదుగురికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం తన కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారి మన్ననలు పొందాలని సూచించారు.

దుగ్గి పరిసరాల్లో గజరాజుల గుంపు



దుగ్గి పత్తి పొలాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: కురుపాం మండలంలో ఇటీవల సంచరించిన ఒంటరి ఏనుగు ఆదివారం రాత్రి దుగ్గి పరిసరాల్లోకి చేరింది. మిగిలిన ఏడు గజరాజులు కూడా దుగ్గి పరిసరాల్లోనే సంచరిస్తున్నాయి. ఒంటిరి ఏనుగు మాత్రం గుంపులో కలవకుండా సంచరిస్తోంది. అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఏనుగుల జాడను గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జాగ్రత్తలు పాటించాలని దుగ్గి, కళ్లికోట, గుణానపురం, మార్కొండపుట్టి తదితర గ్రామల ప్రజలకు సూచిస్తున్నారు.

పోడుపట్టాలే గిరిజనుల ఆస్తి

- పోడు పట్టాలు పంపిణీ చేసిన డిప్యూటీసీఎం రాజన్నదొర
- సత్వరమే ఆన్‌లైన్‌చేసి, రైతుభరోసా వర్తించేలా చర్యలు



పోడుపట్టాలు పొందిన గిరిజన లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

మక్కువ: గిరిజనులు సాగుచేసిన పోడుభూమికి ప్రభుత్వం అందించిన పట్టాలే వారి ఆస్తి అని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కె.పెద్దవలస, బొద్దుసామంతవలస గ్రామాలకు చెందిన సుమారు 43 మంది గిరిజన కుటుంబాలకు సోమవారం పోడు పట్టాలు అందజేశారు. పోడుపట్టాలు పొందిన గిరిజన లబ్ధిదారులందరికీ రైతుభరోసా పథకం వర్తించేలా, ఆన్‌లైన్ జరిపించాలని తహసీల్దార్ సూర్యనారాయణకు డిప్యూటీ సీఎం సూచించారు. ప్రతీ గిరిజన కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పోడుపట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. రాష్ట్రంలో ఉన్న వేలాది గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం మంచిచేస్తోందన్నారు. గిరిజన రైతులను సాగు భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్లిక రాములమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడిరంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య మరింత పటిష్టం

శ్రద్ధగా వినడం.. చక్కగా చదవడం.. అందంగా రాయడం.. సరళంగా మాట్లాడడం .. ప్రాథమిక భావనలను అర్థంచేసుకోవడం.. వంటి విద్యాభ్యసన, భాషా సామర్థ్యాలను చిన్నారుల్లో పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యాప్రణాళికలు అమలుచేస్తోంది. చిన్నవయసులోనే విద్యార్థుల చదువులకు గట్టిపునాది వేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యను మరింత పటిష్టవంతం చేసేలా టీచర్లకు శిక్షణ ఇస్తోంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.

- పూర్వ ప్రాథమిక, 1, 2 తరగతుల పిల్లలకు ఎఫ్‌ఎల్‌ఎన్
- 'ప్రథమ్' భాగస్వామ్యంతో కార్యక్రమం అమలుకు శ్రీకారం
- అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేలా ప్రణాళిక
- మండలానికి ముగ్గురు వంతున 81 మంది టీచర్లను డీఆర్‌పీలుగా ఎంపిక
- డీఆర్‌పీలకు శిక్షణ పూర్తి: డీఈఓ



డీఆర్‌పీల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: విద్యార్థుల చదువులే రాష్ట్రానికి పెట్టుబడిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. వారి బంగారు భవిష్యత్తు కోసం విద్యాసంస్కరణలు అమలుచేస్తోంది. ఆర్థిక సమస్యలతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరంకారాదన్న లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. నాడు–నేడుతో సర్కారు బడులను సుందరంగా తీర్చిదిద్దుతోంది. సకల సదుపాయాలు కల్పిస్తోంది. తాజాగా.. ప్రాథమిక విద్యను మరింత పటిష్టవంతం చేసే చర్యలు చేపట్టింది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాల స్థాయి చిన్నారుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని రూపొందించింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) అమలు నేపథ్యంలో ఎన్‌జీఓ సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. దీనికోసం ముందస్తుగా రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షణకు ఆసక్తిగల ఉపాధ్యాయులను ఎంపిక చేసిన శిక్షణ ఇస్తోంది. అక్కడ శిక్షణ పొందిన వారితో మండల స్థాయిలో సెకంటరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

మండలానికి ముగ్గురు టీచర్ల ఎంపిక

ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం క్షేత్రస్థాయి సెకండరీ గ్రేడ్ టీచర్లతో అమలుచేసేందుకు రాష్ట్రస్థాయి శిక్షకులతో తొలిదశగా జిల్లాస్థాయి శిక్షకుల (డీఆర్‌పీలు)కు రాష్ట్రంలో ఆరు కేంద్రాలలో ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చింది. విజయనగరం జిల్లా నుంచి మండలానికి ముగ్గురు చొప్పున 81 మంది ఎస్జీటీలు శిక్షణ పొందారు. వీరంతా త్వరలో మండలాలకు వెళ్లి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ ఉద్దేశాలను బోధిస్తారు.

జ్ఞాన జ్యోతి, జ్ఞాన ప్రకాష్‌గా విభజన

ఎఫ్‌ఎల్‌ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞానజ్యోతిగా, ప్రాథమిక విద్య (తరగతి–1, 2) జ్ఞానప్రకాష్‌గా విభజించారు. జ్ఞాన జ్యోతి విభాగంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయలకు 120 రోజులు, జ్ఞాన ప్రకాష్ విభాగంలోని ఎస్‌జీటీలకు 60 రోజుల శిక్షణ ఉంటుంది. ఏడాదికి 20 రోజుల వంతున మూడేళ్లపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. 20 రోజులలో తొలి ఆరు రోజులు ఆఫ్‌లైన్‌లో, మిగిలిన 14 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ప్రాథమిక విద్యకు సంబంధించిన జ్ఞాన ప్రకాష్ బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్‌పీలకు తర్ఫీదు ఇస్తున్నారు.

నూతన విద్యావిధానంలో భాగంగా....

నూతన విద్యావిధానం 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ–1లో 3 – 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ–2లో 4–5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమేలు చేస్తారు. ఐదేళ్ల నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలు కచ్చితంగా కలిగి ఉండాలి.

ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు ఎందుకు?

పదోతరగతికి చేరుకుంటున్న కొందరు విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు లోపిస్తున్నాయని, తెలుగు, గణితం వంటి సబ్జెక్టుల్లో ప్రాథమిక భావనలపై కూడా అవగాహన ఉండడంలేదని అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థి 1, 2 తరగతులు పూర్తి చేసి మూడో తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం వంటి అభ్యసన, భాషా సామర్థ్యాలను పెంపొందిస్తారు. గణితంలో చదుర్విధ ప్రక్రియలైన కూడి కలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై ప్రతివిద్యార్థి నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దుతారు.

డీఆర్‌పీలకు శిక్షణ పూర్తి

ప్రాథమిక విద్యలోనే విద్యార్థి అభ్యసన, భాష సామర్థ్యాలను మెరుగుపరిచే నూతన బోధన నైపుణ్యాలను ఉపాధ్యాయులకు అందించే ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తోంది. దీని కోసం మండలానికి ముగ్గురు వంతున ఉపాధ్యాయులను ఎంపిక చేసి డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)లుగా వారికి ఇటీవల శిక్షణ ఇచ్చాం. త్వరలో వీరంతా మండలాలకు వెళ్లి ఎస్‌జీటీలకు ఆరురోజు ఆఫ్‌లైన్‌లో, 14 రోజులు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఈ శిక్షణ దోహదపడుతుంది.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ





డీఆర్‌పీల శిక్షణలో బోధన సామర్థ్యాలను మెరుగుపరిచే ప్రదర్శనలు

సీఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక తదితరులు

- 15న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాక
- ఏర్పాట్లపై ఎస్పీతో కలిసి కలెక్టర్ సమీక్ష

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం పర్యటన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి ఈనెల 15న జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. ఈ ప్రారంభ కార్యక్రమంతో పాటు ఇక్కడి నుంచే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో నిర్మించిన మరో నాలుగు వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై సోమవారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. జిల్లా అధికారులకు అప్పగించిన విధులను సమన్వయంతో సమర్థంగా నిర్వహిస్తూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఆర్వో, డీసీహెచ్‌ఎస్‌లను కలెక్టర్ ఆదేశించారు.

పర్యటన షెడ్యూల్ ఖరారు...

ముఖ్యమంత్రి ఈనెల 15వ తేదీన విజయనగరం పర్యటనకు షెడ్యూల్ దాదాపుగా ఖరారైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. తొలుత జేఎన్‌టీయూ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా వైద్య కళాశాల ప్రాంగణానికి వస్తారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత వైద్య కళాశాల ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తారు. అనంతరం వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకిస్తారు. స్కిల్ ల్యాబ్, బయోకెమిస్ట్రీ, అనాటమీ ల్యాబ్‌లను సందర్శిస్తారు. అనంతరం లెక్చర్‌హాల్ నుంచి రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన మరో నాలుగు వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. చివరిగా కొత్తగా ప్రారంభమైన ఐదు కళాశాలల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదంతా పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో విశాఖపట్నం తిరుగు ప్రయాణమవుతారు.

చట్టప్రకారమే చంద్రబాబు అరెస్టు



జెడ్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- సమగ్ర ఆధారాలతోనే చంద్రబాబుకు సీఐడీ కోర్టు రిమాండ్ విధింపు
- జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడుకు ఏసీబీ కోర్టు చట్టపరంగా రిమాండ్ విధించిందని, ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 2014–19 మధ్య కాలంలో పాలన సాగించిన చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్న పూర్తి ఆధారాలతోనే న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందంటూ టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారం సత్యదూరమన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు చంద్రబాబును అరెస్టుచేశాయన్న నిజం తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ఖజానాతో పాటు, ప్రజల ఆస్తులకు కస్టోడియన్‌గా వ్యవరించాల్సిన వ్యక్తి వాటిని దారిమళ్లించినట్టు న్యాయస్థానం తేల్చిందన్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాల్లో చంద్రబాబు, అతని అనుచరగణం, అతని తరఫున న్యాయవాదులు రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అవినీతి జరగలేదని ఎందుకు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లారనే... అందరినీ జైలుకు పంపుతారా అంటూ జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు చట్టాలపైన, రాజ్యాంగంపైన కనీస అవగాహన లేకపోవడంవల్లే నోటికొచ్చినది మాట్లాడుతున్నట్టు విమర్శించారు. న్యాయస్థానం తీర్పుకు వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునివ్వడం విచాకరమన్నారు. తప్పుచేసిన వారిని శిక్షించేందుకే న్యాయస్థానాలు ఉన్నాయన్న సత్యాన్ని తెలుసుకోకపోవడం ఆవేదన కలిగించే అంశమన్నారు. ఆయన వెంట వెలమ కార్పొరేషన్ రాష్ట్రచైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు ఉన్నారు.

ఇన్నాళ్లకు ఎన్టీఆర్ ఆత్మకు శాంతి

- చంద్రబాబుపై ఉన్న కేసులన్నింటి మీద న్యాయ విచారణ జరగాలి
- చట్టంపై ప్రజలకు నమ్మకం పెరిగింది
- ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుతో స్వర్గంలో ఉన్న దివంగత ఎన్.టి.రామారావు ఆత్మకు ఇన్నాళ్లకు శాంతి కలిగిందని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సొంత మామకే వెన్నుపోటు పొడిచి పార్టీని, ముఖ్యమంత్రి పీఠం లాక్కొన్న చంద్రబాబు.. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికపోయాడన్నారు. ఆయన అరెస్టుతో న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. విజయనగరంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కోలగట్ల మాట్లాడారు. యువతకు నైపుణ్య కల్పన పేరిట రూ.371 కోట్ల మేర పక్కదారి పట్టించిన చంద్రబాబు.. రూ.241 కోట్ల ప్రజా ధనాన్ని సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసినట్టు కేంద్ర దర్యాప్తు అధికారులు నిగ్గుతేల్చారన్నారు. ఢిల్లీ నుంచి రూ.కోట్లు ఫీజు చెల్లించి న్యాయవాదిని తీసుకొచ్చినా న్యాయమే గెలిచిందన్నారు. చంద్రబాబుపై నమోదైన కేసుల స్టేలు ఎత్తివేసి న్యాయవిచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్ర రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత పెద్ద నగరంగా ఉన్న విశాఖను కాదని... తన స్వార్థ, సామాజిక వర్గ ప్రయోజనాల కోసం అమరావతిని రాజధానిగా చేసి ప్రజలను చంద్రబాబు మోసం చేశాడన్నారు. సమావేశంలో అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

బంద్ విఫలం

- అవినీతికేసులో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చిన టీడీపీ, జనసేన
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కానరాని ప్రజాస్పందన
- యథావిధిగా బస్సుల రాకపోకలు
- శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసుల చర్యలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అవినీతి మచ్చలేవని, తానొక నిప్పు అని, ఏ వ్యవస్థా తనను తాకలేదని ఇన్నేళ్లుగా గొప్పలు చెబుతూ తిరిగిన చంద్రబాబు అసలుగుట్టు రట్టయ్యింది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్లు దుర్వినియోగమయ్యాయనే కేసులో ముద్దాయిగా కటకటాల వెనక్కువెళ్లిన చంద్రబాబుకు ప్రజామద్దతు కరువైంది. ఆయనకు ఈనెల 22వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో టీడీపీ, జనసేన నాయకులు సోమవారం బంద్ పిలుపునిచ్చారు. అది కాస్తా తుస్సుమంది. అవినీతి బురదలో కూరుకుపోయిన చంద్రబాబుకు మద్దతు ఇచ్చేందుకు సాధారణ ప్రజానీకం స్పందించలేదు. తప్పుచేస్తే శిక్షించకూడదా అంటూ కొందరు తిరిగి ప్రశ్నించారు. చివరకు టీడీపీ, జనసేన శ్రేణులూ తూతూమంత్రంగానే చేయమన్నారు కాబట్టి చేశామన్నట్లుగా నిరసన కార్యక్రమాలను కాసేపు చేసి ఎవరి దారిన వారు పోయారు. అక్కడక్కడా ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నా కొంతసేపటి తర్వాత యథావిధిగా రాకపోకలు సాగించాయి. జనజీవనానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

- విజయనగరం జిల్లా కేంద్రంలో బంద్‌కు జనసేన, లోక్‌సత్తా పార్టీ మద్దతు తెలిపినా ఆ పార్టీల కార్యకర్తలు ముఖం చాటేశారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు కొంతమంది ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు ఉదయం 6 గంటలకే వచ్చినా గంటపాటు నినాదాలు చేశారు. తర్వాత బస్సుల రాకపోకలు యథావిధిగానే సాగాయి. దుకాణాలను బలవంతంగా మూయించినా ఒకటీ రెండు గంటల వ్యవధిలోనే మళ్లీ తెరుచుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత వర్గీయులెవరూ కనిపించలేదు. ఆ పార్టీకి జిల్లాలో పెద్ద దిక్కు అశోక్ గజపతిరాజు సైతం వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లిపోయారు.
- రాజాంలో దుకాణాలను టీడీపీ కార్యకర్తలు బలవంతంగా మూయించారు. కాసేపటికే వ్యాపారులు తెరిచేశారు. అంబేడ్కర్ జంక్షన్ వద్ద టీడీపీ కార్యకర్తలు మానవహారం నిర్వహించారు.
- బొబ్బిలిలో బేబీ నాయన సహా టీడీపీ, జనసేన కార్యకర్తలు దండం పెడుతూ వేడుకున్నా వ్యాపారులు తమ దుకాణాల షట్టర్లు దించినట్లే దించి కాసేపటికే తెరిచేశారు. బాడంగి ప్రధాన రహదారిపై మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు తన అనుచరులతో కాసేపు బైఠాయించారు.
- నెల్లిమర్లలో స్థానిక టీడీపీ నాయకులు రామతీర్థం జంక్షన్ నుంచి జూట్‌మిల్లు వరకూ కలియ తిరుగుతూ దుకాణాలను బలవంతంగా మూయించేశారు. వారు అలా వెళ్లిపోగానే వ్యాపారులు యథావిధిగా తెరిచేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించేందుకు టీడీపీ కార్యకర్తలు విఫలయత్నం చేశారు.
- గజపతినగరంలో బంద్ నిర్వహణ మాటెలా ఉన్నా మరోసారి వర్గపోరు భగ్గుమంది. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, కరణం శివరామకృష్ణ వర్గాలు బాహాబాహికి దిగాయి. వర్గపోరు జాడ్యం జనసేన పార్టీకి అంటుకుంది. కేఏ నాయుడికి పడాల అరుణ వర్గం, శివరామకృష్ణకు మర్రాపు సురేష్ వర్గం మద్దతుగా విడిపోయాయి.
- చీపురుపల్లి పట్టణంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో కొంతమంది కార్యకర్తలు ఉదయం 7 గంటలకే ప్రధాన రహదారులపైకి వచ్చి నినాదాలు చేశారు. దుకాణాలు తెరవనీయకుండా అడ్డుకున్నారు. బస్సులకు అడ్డంగా నిలుచున్నారు. రెండు మూడు గంటల తర్వాత ఎవరిమార్గాన వారు వెళ్లిపోయారు.
- శృంగవరపుకోట నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. ఎస్.కోటలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, గొంప కృష్ణ వర్గాలకు చెందిన కార్యకర్తలు కొంతసేపు నిరసన తెలిపారు.



విజయనగరంలో తెరిచిన దుకాణాలు

క్లుప్తంగా

పీసా చట్టం అమలు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

పార్వతీపురం: గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించే పీసా చట్టాన్ని అమలుచేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు బిడ్డిక రామారావు, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాలను గిరిజనేతరులు అక్రమించినట్లు ఆరోపించారు. ఇంతవరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలలో 517 అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. 1/70 యాక్ట్ పీసా చట్టం అమలు చేసి గిరిజనేతరులు అక్రమించుకున్న షాపులను గిరిజనేతరులనుంచి స్వాధీనం చేసుకుని గిరిజనులకు అప్పగించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


కేజీహెచ్‌లో కంబాల లక్ష్మి(49)మృతదేహం

భామిని: రోడ్డుప్రమాదంలో గాయపడిన మండలంలోని కోసలి గ్రామానికి చెందిన కంబాల లక్ష్మి(49) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల6వ తేదీన ఆమె సోదరుడి బైక్‌పై కొత్తూరు వెళ్తుండగా కల్లెమ్మ సమీపంలో జారిపడి తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా వైద్యసేవలు పొందుతూ మరణించింది. మృతురాలి సోదరుడు కంబాల షణ్ముఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తూరు పోలీసులు విశాఖ కేజీహెచ్‌కు వెళ్లారు.

లారీని ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండల కేంద్రంలోని నటరాజ్ దాబా సమీపంలో ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో సోమవారం ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై గజపతినగరం ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి విజయనగరం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు నటరాజ్ దాబా వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టి కిందపడి గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని 108లో సమీప ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

టీచర్ ఇంట్లో దొంగతనం

బొబ్బిలి: పట్టణంలోని రెల్లివీధిలో నివసిస్తున్న ఉపాధ్యాయిని పర్తాపు ప్రవంతి ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు పడి 43 తులాల బంగారం, రూ.13.50లక్షల నగదుదోచుకున్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తలిద్దరూ శుక్రవారం ఊరెళ్లారు. ఊరి నుంచి శనివారం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సీఐ ఎం.నాగేశ్వర రావును వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యవధిలోగా వినతుల పరిష్కారం

• కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలకు వచ్చిన వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఆమె జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 152 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. వినతులు స్వీకరించినప్పటి నుంచి కింది స్థాయి సిబ్బంది ఆయా వినతులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు? అర్జీదారుల కోరిన విధంగా పరిష్కారం అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు వారి పరిధిలో వచ్చిన వినతుల పరిష్కారంపై నివేదికలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మంగళవారం ఒక్కో శాఖకు సంబంధించిన కేసులను సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వశాఖల కేసులకు సంబంధించి జిల్లా స్థాయి నోడల్ అధికారిగా మైనారిటీ సంక్షేమ అధికారి లావణ్యను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సూర్యనారాయణ, సుదర్శన దొర పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

తక్షణమే ఫిర్యాదులపై స్పందన

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులకు అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయమందించాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్సై ప్రభావతి, పోలీసుఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాధితుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ఫర్హీన్

సత్వరమే అర్జీదారులకు న్యాయం

• కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులకు సత్వరమే నాణ్యమైన పరిష్కారం చూపి అర్జీదారులకు న్యాయం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని 66 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను శాఖల వారీగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావులు అర్జీలు స్వీకరించారు.

ట్రైసైకిల్స్ సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న మూడు చక్రాల సైకిల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌లో బలిజిపేట మండల కేంద్రానికి చెందిన బొత్స లలితకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. ఆమె జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నడవడానికి వీల్‌చైర్ కావాలని అభ్యర్థించడంతో కలెక్టర్ తక్షణం స్పందించి మూడు చక్రాల సైకిల్‌ను మంజూరుచేశారు. ఈ మేరకు మూడు చక్రాల సైకిల్‌ను బాధితురాలికి జేసీ అందజేయగా ఆమె హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా ప్రతిభావంతులు, వయోవృద్ధుల అధికారి పీవీ.రమణమూర్తి తదితరులున్నారు.


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్


మూడు చక్రాల సైకిల్‌ను అందజేస్తున్న జేసీ గోవిందరావు

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ హర్షిత, ఎస్బీ సీఐ, సీహెచ్. లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి.ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: పరిపాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల రిఫ్రెషర్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలన సంబంధమైన విషయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకువెళ్లాల్సింది పంచాయతీ కార్యదర్శులేనని అభిప్రాయ పడ్డారు. గ్రామాల్లో అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజలతో మమేకం కావాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, వచ్చిన అవకాశాన్ని పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజల మెప్పు పొందేందుకు కృషి చేయాలి

కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని, పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. విభిన్నమైన ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులతో పరస్పరం తమ అనుభవాలను పంచుకుంటే మరిన్ని అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ శిక్షణ కార్యక్రమం అంశాలను వివరించారు. స్వామిత్వ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం, లేఅవుట్లు, ఎస్‌డీజీ అంశాలపై శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణకు సంబంధించి పుస్తకాలను జెడ్పీ చైర్మన్ పంచాయతీ కార్యదర్శులకు అందించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్‌రాజా, జెడ్పీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పుస్తకాలను కార్యదర్శులకు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పాముకాటుకు గురై కౌలురైతు మృతి


ప్రభాకరరావు మృతదేహం

రేగిడి: మండల పరిధిలోని పెద్దశిర్లాం గ్రామానికి చెందిన కౌలు రైతు కురిటి ప్రభాకరరావు (50) సోమవారం పాము కాటుకు గురై మృతిచెందాడు. తాను కౌలు చేస్తున్న పొలంలో వరిపంటకు నీరుపెడుతున్న సమయంలో పాముకాటు వేసింది. వెంటనే పక్కనే ఉన్న రైతులు గమనించి ప్రభాకరరావును హుటాహుటిన ఇంటికి తీసుకువెళ్లారు. ఆస్పత్రికి తరలించే సమయంలో మృతిచెందాడు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు సాయిసంతోష్, సోమశేఖర్‌లు ఉన్నారు.

స్టార్టప్ సమస్యల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి

• రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి

విజయనగరం అర్బన్: స్టార్టప్ సంస్థల నిర్వహణలో యువమేధస్సు ప్రతిభ చూపడంతోపాటు వాటి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సాంకేతికతను వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి సూచించారు. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీలో 'వ్యవస్థాగత, నాయకత్వ అభివృద్ధి' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించడంతో పాటు వాటి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సమాంతరంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఔత్సాహికులైన విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలనుకునే వారు ముందుగా ఈఎల్‌డీపీలో నమోదు చేసుకోవాలని చెప్పారు. నమోదైన విద్యార్థులందరినీ 100 మంది చొప్పున ఒక బ్యాచ్‌గా విడదీసి ఈ బ్యాచ్‌లను మళ్లీ గ్రూపులుగా విడదీసి, ప్రతి గ్రూప్‌లో 4 నుంచి 5 మంది విద్యార్థులు సభ్యులుగా ఉండే విధంగా తయారు చేసి ఐఐటీ పాట్నా, ఐఐఎం కోల్‌కత్తా నుంచి నిష్ణాతులైన నిపుణులు గ్రూపులకు మెంటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, అధ్యాపక సిబ్బందితోపాటు విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కర లేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

ఫోర్ట్ సిటీ స్కూల్,
100 ఫీట్ రింగ్ రోడ్, విజయనగరం
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9951602843, 9705346345

ఉమ్మడి జిల్లాగానే స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు

• స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వి రమణ

విజయనగరం: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే స్కూల్‌గేమ్స్ అండర్-14,17 బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఆసక్తి గల క్రీడాంశాల్లో పాల్గొనవచ్చని సూచించారు. ఇందులో భాగంగా ఈనెల 20వ తేదీలోగా అండర్-17 విభాగంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అండర్-14,17 విభాగాల్లో రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మిగిలిన క్రీడాంశాలకు సంబంధించి ఎంపిక పోటీల తేదీలను త్వరలోనే తెలియజేస్తామని, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి గల క్రీడాకారులను సిద్ధం చేసుకోవాలని సూచించారు.


స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ

డోలీలో మూడు కిలోమీటర్ల ప్రయాణం

పాచిపెంట: మండలంలోని మూటకూడు గ్రామానికి చెందిన సేబినరసయ్య సోమవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో గ్రామానికి రహదారి సౌకర్యం లేక డోలీ కట్టి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గల్లపాడు గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడినుంచి ఆటోలో సాలూరు సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


నరసయ్యను డోలీలో తరలిస్తున్న గ్రామస్తులు

బీజేపీ అభ్యున్నతికి కృషిచేయాలి

• పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు
• పార్టీ జిల్లా అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ

విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ అభ్యున్నతికి కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నడుకుదిటి ఈశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడి ఎంపిక శుభదాయకమన్నారు. ముందుండి జిల్లాను నడిపించాలని, అందుకు పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కృషిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరరావు మాట్లాడుతూ అందరి సమష్టికృషితో పార్టీని అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషిచేస్తానని, అంత్యోదయ సూత్రంతో పనిచేస్తానని చెప్పారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ఇన్‌చార్జ్ వీవీ.రామరాజు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాశీవిశ్వనాథరాజు, తదితరులు

నాగావళిలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి


రాంబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తె

వీరఘట్టం: కాలువ గట్టులో స్నానం చేసి కొద్దిసేపటిలో వచ్చేస్తానని ఇంట్లో చెప్పిన వెళ్లి వ్యక్తి విగతజీవిగా మారాడు. వీరఘట్టం మండలం ఎం.రాజపురం జంక్షన్ వద్ద సోమవారం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం పంచాయతీలోని పెరుగువీధికి చెందిన వెన్నెల రాంబాబు(38) గ్యాస్ వెల్డింగ్ పనులు చేస్తూ తన తల్లితో పాటు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. రాంబాబు కొన్నేళ్లుగా మూర్ఛ రోగంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం కుటుంబంలో అందరికీ తెలుసు. ఫిట్స్ వచ్చేటప్పుడు చేతిలో ఇనుప తాళాలు పెడితే సాధారణ పరిస్థితికి వచ్చేవాడు. ఎప్పుడూ ఇంటి వద్దే స్నానం చేస్తుండేవాడు. అయితే సోమవారం ఎం.రాజపురం జంక్షన్ వద్ద ఉన్న తోటపల్లి ఎడమకాలువ పరిధిలో నాగావళి 6వ బ్రాంచ్ కాలువ వద్దకు ఉదయం 7 గంటలకు ఒంటరిగా వెళ్లాడు. ఉదయం 10 గంటలవుతున్నా భర్త ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులను కాలువ గట్టు వద్దకు భార్య లక్ష్మి పంపించింది. అయితే కాలువ గట్టు సమీపంలో వెల్‌సైఫన్‌లో రాంబాబు అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి బయటకు తీశారు. అప్పటికే రాంబాబు మరణించాడు. కాలువ గట్టు వద్ద స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో కాలువ గుండా కొట్టుకుపోయి సమీపంలో ఉన్న వెల్ సైఫన్ లోకి కొట్టుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సమాచారంతో ఎస్సై ఎం.వి.రమణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹156	₹282	₹ 292